మా అల్లుడు రావడం, మా అమ్మాయిని తీసుకుపోడం ఐంది కదా. మా అల్లుడేమో, మా ఇంట్లో ఇంతకన్నా మంచి టేపు రికార్డరే ఉన్నాది కనక ఇది ఇక్కడే వుణ్ణియ్యండి, మేం ఎప్పుడేనా వొస్తే నాలుగు పాటలు వినొచ్చు. అని మా అమ్మాయికి ప్రెజంటేషన్‌గా వొచ్చిన టేపురికార్డరు వొదిలేసి వెళ్లాడు. పాత పాటలు బావున్నాయంటూ కేసెట్లు మాత్రం పట్టుకుపోయేడు.'

'అయ్యో, ఆ పాట ఉంటే ఒకసారి విందామనుకున్నానే!' అన్నాను.

'టేపు రికార్డరు ఊరికే వుండిపోయిందే అని మా వాసుగాడికి ఓ వంద రూపాయలిచ్చి ఏవో నాలుగు కేసెట్లు కొని తెచ్చీరా, అన్నాను. వాడు తెచ్చిన కొత్త కేసెట్లలో ఒక దాంట్లో ఉంది, ఈ బోటనీ క్లాసు పాట. రెండు రోజులపాటు ఈ కొత్తపాటలు విన్లేక ఆఫీసులో ఓవర్‌టైమ్ ఒప్పేసుకుని తప్పించుకున్నాను గాని, అలా ఎన్నాళ్లు తప్పించుకోగలం? ఇహ కొసాకీ ఈ పాటలు వింటూ ఉండవలసిందే కదా అని అప్పుడు ఇవన్నీ వింటున్నాను.'

'పాపం, నీకు కష్టమే' అన్నాను.

'కష్ట మేమిటుందిలే-'

'కష్టం కాకేమీ? మనసున మల్లెల పాటా సడిసేయకోగాలి పాటా పాడిన నోటితోటే బోటనీ క్లాసు పాటలు పాడేస్తున్నావు, పువ్వులమ్మిన ఊళ్లోనే కట్టెలు అమ్మినట్టు' అని మా వెంకన్న బావ మీద సానుభూతి చూపించేను. మా బావ రెండు నిమిషాలు మౌనం పాటించేడు.

'ఎంకి పాటలు నీకు గుర్తున్నాయి కదా'

'అవును. చాలా బాగా పాడేవాడివి' అన్నాను.

'ఉత్త మాటలు నీవి, పొమ్మందిరా;

ఎంకి,

కొత్తపాటలు పాడుకొమ్మందిరా!' అని ఎత్తుకుని పాట పాడుతూ తన తత్వం సూచించేడు మా వెంకన్నబావ. ★

# 28. రోజూ కోటిమంది అనుభవం

**మ**నకి జోకులా వినిపించే ఒక సంభాషణ ఆ మధ్య ఒక ఫారిన్ మేగజైన్‌లో చదివేను.

జపానుకి వెళ్లిన ఒక భారతీయుడు (భారతీయుల్లో ఎక్కువమంది 'జపానికి' వెళ్లేవాళ్లుంటారు గాని 'జపానుకి' వెళ్లేవాళ్లు కూడా కొందరు ఉంటారు కదా!) ఆ దేశంలో ఒక రైల్లో ప్రయాణం చేసేడుట. టిక్కెట్టు వొసూలు చేసే గేటు దగ్గిర ఒక ఆఫీసరు బల్లా కుర్చీ వేసుకుని కూర్చున్నాడట. గేట్లోంచి అవతలికి వెళ్లిపోతున్న ప్రతి వ్యక్తిదగ్గిరా టిక్కెట్టు పుచ్చుకొని ఒక్కొక్క వ్యక్తికీ కొన్ని 'యన్'లు చెల్లిస్తున్నాడట. మన భారతీయుడు "టిక్కెట్టు కొన్నప్పుడు నాకు చిల్లర ఇచ్చీసేరండీ'' అన్నాడుట. ఆ ఆఫీసరు, "ఔను, నిజమే కాని, ఇది మీకు నష్ట పరిహారంగా చెల్లిస్తున్నాం'' అన్నాడట.

"నష్ట పరిహారమా? ఎందుకు?"

"మీరిప్పుడు ప్రయాణం చేసి వచ్చిన రైలు ఐదు నిమిషాలు లేటుగా వచ్చింది కదా; అందుకు"

"ఏమిటీ! రైలు ఐదు నిమిషాలు లేటుగా వొస్తే దానికి నష్ట పరిహారమా! అదీనీ, టిక్కెట్ వెలలో సగమా?" అని ఆశ్చర్యపడిన భారతీయుడు "ఒకవేళ పదినిమిషాలు లేటుగా వొస్తే?" అన్నాడట.

"పది నిమిషాలు లేటుగా వొస్తే టిక్కెట్ ధర మొత్తం నష్టపరిహారంగా ఇచ్చేస్తాం" అన్నాడా ఆఫీసరు.

"అయ్యబాబోయ్, అలాగా! మరో రైలు పదిహేను నిమిషాలు లేటుగా వొచ్చిందనుకోండి! అప్పుడేం చేస్తారు?"

"ఏమో, నాకు తెలీదు. ఎందుకంటే ఇంతవరకూ ఎప్పుడూ మా దేశంలో ఏ రైలూ పదిహేను నిమిషాలు లేటుగా రావడం అంటూ జరగలేదసలు, వెళ్లండి, మీ తర్వాత ఇంకా చాలామంది ఉన్నారు. ఇలా మీతో నేను హస్కు కొడుతూ కూచుంటే కొంతమందికి పూర్తి టిక్కెట్ వెల ఇచ్చీవలిసొస్తుంది."

మన దేశంలో రైళ్లు ఆలస్యంగా రావడం అనేది నిత్య సత్యం. రైల్వే టైమ్‌టేబిళ్ళ యొక్క ఉపయోగం ఏమిటి?" అని అడిగితే "రైళ్లు ఎంతెంత లేటుగా వొస్తాయో సరిగ్గా లెక్క కట్టుకుందికి" అని జవాబు వస్తుంది.

ఓ సారి నేను బెజవాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడొక తమాషా జరిగింది. ఢిల్లీ నుంచి మద్రాసు వెళ్లే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఆ రోజు సరిగ్గా సమయానికి బెజవాడ వచ్చేసింది. ఇంటి దగ్గర్నుంచి రైలు లేటా అని ఫోన్లో అడిగిన పెద్ద మనిషి లేదండీ, కరెక్టు టైమ్‌కే వొస్తుంది అని వచ్చిన జవాబు విని; స్టేషన్‌కొస్తూ తోవలో ఒక పువ్వుల దండ కొనుక్కొచ్చి బండి ఆగగానే డ్రైవర్ని ఇంజిన్ కేబిన్‌లోంచి ఇవతలికి లాగి; పూలదండ అతని మెళ్లో వేసేసి తను చప్పట్లు కొడుతూ అక్కడ చేరిన వాళ్లందరిచేతా చప్పట్లు కొట్టించేడు (అందులో నేను కూడా ఉన్నాను).

దాంతో ఆ డ్రైవరు గారు సిగ్గు పడిపోయి, మెడలోంచి దండ తీసేసి "క్షమించండి! ఈ గౌరవానికి నేనెంతమాత్రం అర్హుణ్ణి కాదు. ఇది నిజానికి నిన్నను ఈవేళకి రావలసిన ట్రెయిను" అని చెప్పేసేడు.

రైలు లేటా అని ఫోన్ చెయ్యకుండా రైలుకి వెళ్లేవాళ్లే ఎక్కువమంది ఉంటారు. "నువ్వు ఎక్కవలసిన రైలు ఎప్పుడూ ఒక జీవిత కాలం లేటు" అని ఎవరో కవి రాసేసినా; అదేదో పొయెటిక్ సెన్సేగాని కామన్‌సెన్స్ కాదుకదా.

"హవ్‌రా నుండి హైదరాబాద్ వెళ్లు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్ ఈ దినము సుమారు రెండు వందల నిముషములు ఆలస్యముగా నడుచుచున్నది" అని ఎనౌన్స్‌మెంటు వినిపిస్తుంది. మొదటిసారి ఆ ఎనౌన్స్‌మెంటు వినేటప్పుడు ఏవో "కొన్ని నిమిషాలు" ఆలస్యంలే; ఫరవాలేదు అని అశ్రద్ధ చేస్తారు ప్రయాణికులు. క్రమంగా రెండు వందల నిమిషాలు అంటే సుమారు

మూడున్నర గంటలు అని తెలుస్తుంది. కాని ఇంక అప్పుడు చేసేదేం ఉండదు. మొదటే సరిగ్గా వింటే ఇంటికి వెళ్లి స్నానం చేసి టిఫిన్ తిని రావడానికి టైమ్ ఉంటుందని అర్థమయ్యేది. కాని రెండోమాటు ఎనౌన్స్‌మెంటు వినిపించేలోగానూ, అది అర్థం చేసుకునే లోగానూ కొంత టైమ్ గడిచిపోయి "ఏం చేస్తాం, మన ఖర్మ" అని స్టేషన్‌లోనే మిగిలిన టైమ్ గడిపేస్తాం. ఆస్కార్ వైల్డ్ అనే పాశ్చాత్య రచయిత "టైమ్ ఈజ్ వేస్ట్ ఆఫ్ మనీ" అన్నాడు. దీంట్లో సత్యం రైళ్లు ఆలస్యంగా రావడం వల్ల మనకి దఖలుపడే "టైమ్" పట్ల అక్షరాలా నిజం అవుతుంది.

ఓసారి నేను విశాఖపట్నం నుంచి రాయపూర్ మీదుగా ఢిల్లీ వెళ్లే రైలెక్కేను. ముందురోజు రాత్రి పదకొండున్నరకి విశాఖపట్నంలో బయల్దేరిన ఆ 'ఎక్స్‌ప్రెస్' రైలు; మర్నాడు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో రాయపూర్ చేరింది. ఇదుగో వెళ్లిపోతుంది, అదిగో వెళ్లిపోతుంది అని నమ్ముకున్న నేను కంపార్ట్‌మెంటులోనే అలా కూచుండిపోయేను. కాలక్షేపానికి తెచ్చుకున్న బుక్‌స్టాల్‌లో మరో పుస్తకం ఏదైనా కొనుక్కుని రావచ్చుకదా అని సామాను ఎదటి సీట్లో వాళ్లకి వప్పగించి బండి దిగేను. ఆశ్చర్యం! రైలుకి ఉండవలసిన ఇంజిన్ లేదు!! సరే ఇంకా కొంతసేపు ఆలస్యం వుంది కాబోలని అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ ఆఫీసుకెళ్లి అక్కడున్న అధికారిని అడిగాను.

"ఈ రైలు ఇప్పుడప్పుడే బయలుదేరదా?"

"దేరదు"

"ఐతేను; రైల్వే భోజనం బావుండదు కదా; అలా, టౌన్‌లో కెళ్లి భోజనం చేసి రావచ్చా?"

"ఓ! టవున్లోకెళ్లి; బియ్యం, కూరలు, పప్పూ, మిరపకాయలూ, స్టవ్వూ, కిరసనాయిలూ, పాత్ర సామాగ్రీ; కొనుక్కుని, వంట చేసుకొని భోంచేసి మరీ రావచ్చు."

"అదేంటి సార్; నేనేదో మాటవరసకి అన్నారని అలా వేళాకోళం చేస్తారు? ఫలానా ఇంత వ్యవధి ఉందని చెబుదురూ, చాలు!" అన్నాను.

"నేను చెప్పింది నిజమే మహాశయా! ఈ రైలు మధ్యాహ్నం మూడున్నరకి గాని ఇక్కడ బయలుదేరదు." అని చెప్పి ఆ అధికారి తన పనిలో నిమగ్నుడయ్యాడు. నాకింకా అనుమానం తీరక అక్కడ గోడమీద ఎర్రటి అంకెలతో పెయింట్ చేసివున్న టైమ్ టేబిలు చూసేను.

వాల్తేరు-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్; రాక - ఉదయం తొమ్మిదీ ఇరవై; పోక-మధ్యాహ్నం మూడూ ముప్పయి అని స్పష్టంగా ఉంది అక్కడ.

మొన్న జనవరి 20వ తేదీని బొంబాయి నుంచి హైదరాబాద్ వచ్చే 7032 నెంబర్ గల ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్ కొనుక్కున్నాను. ఆ బండి మధ్యాహ్నం 12-35 కి బొంబాయి (వి.టి) వదలాలి. సరేకదా అని 12 అవుతూ వుండగా స్టేషన్ చేరేను. కాస్మోపాలిటిన్ సిటీ మరియు అక్షరాస్యత అధికశాతం గల ప్రాంతం కావడంవల్ల కాబోలు; అక్కడ ఒక నల్లటి తెరమీద తెల్లటి అక్షరాలు అలా నిరంతరం కదుల్తూ ఉన్నాయి తప్పా మైకుల్లోంచి ఎనౌన్సుమెంట్లు వినిపించలేదు. ఆ అక్షరాల సారాంశం ఏమిటంటే, "7032 అనే నెంబరు గల బొంబాయి వి.టి. నుంచి హైదరాబాదు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ దినం మధ్యాహ్నం 12.35 కి బదులు సాయంకాలం 4-45కి బయలుదేరును" - అని అంటే; రైలు బయలుదేరేక ఎక్కడో క్రాసింగు వల్లనో లేక లైను రిపేరువల్లనో ఓ గంటో అరగంటో (సారీ; ఓ వందో యాభయ్యో 'నిమిషాలు')

లేటవడం కాదు, సాక్షాత్తూ రైలు బయల్దేరే చోటనే నాలుగు గంటల పది నిమిషాలు (రెండు వందల యాభై 'నిమిషాలు' మాత్రమే) ఆలస్యం అవుతోందన్నమాట. నిరుద్యోగం, అనారోగ్యం మొదలైన ఈతిబాధల్లో ఇది కూడా ఒకటి, మనకి.

"రోజుకి కోటిమంది ప్రయాణీకుల్ని రవాణా చేస్తున్న భారతీయ రైల్వే; దేశపు నరాల నిర్మాణం (నెర్వస్ సిస్టమ్) వంటిది" అని రైల్వే శాఖవారు అక్కడక్కడా ఉంచే బోర్డుల ద్వారా, అప్పుడప్పుడు టి.వి.లో చూపించే ప్రకటనల ద్వారా మనల్ని హెచ్చరిస్తూ ఉంటే నా నరాల నిర్మాణం (నెర్వస్ సిస్టమ్) దెబ్బతినేస్తూ ఉండడం అలవాటైపోయింది.

నిన్న మా అమ్మాయి విజయవాడ నుంచి వచ్చింది.

"ఏ బండిలో వొచ్చేవు?" అని పలకరించేను.

"సింహాద్రి పేసింజర్‌లో." అంది.

"సింహాద్రి ఎక్స్‌ప్రెస్ అనా, నీ ఉద్దేశం?" అన్నాను.

"నా మొహం, అది ఎక్స్‌ప్రెస్సేమిటి? రేటుకి మాత్రం ఎక్స్‌ప్రెస్సు. ఉదయం తొమ్మిదింటికి బెజవాడలో బైల్దేరి సాయంకాలం ఏడింటికి వాల్తేరు స్టేషన్ చేరింది. 350 కిలోమీటర్ల దూరం కోసం పదిగంటల టైమ్ తీసుకుంది. నాకంఠంలో ప్రాణం ఉన్నంత వరకు దాన్ని నేను 'సింహాద్రి పేసింజర్' అనే అంటాను!" అంది మా అమ్మాయి.

రైల్వే పరిభాషలో పాసింజర్ అంటే రెండెడ్ల బండీ అని వేరే చెప్పక్కర్లేదు, దీనికి తార్కాణంగా విశ్వనాథ సత్యనారాయణ గారి జోకు ఒకటుంది. ఆయనొకసారి గుడివాడ నుంచి బందరు రైల్లో వెడదామని బయలుదేరుతూ ఉంటే ఒక ముసిలావిడ కర్రతో సహా నడుస్తోందిట. టిక్కెట్టుకి డబ్బులు లేక నడక మొదలెట్టిందేమోనని అనుమానించి "రైల్లో పోదాం రా బామ్మా, నీ టిక్కెట్టు నేను కొనిపెడతాలే" అన్నారట ఈయన. "ఒద్దులే నాయనా; నాకు ఈ రోజు కోర్టులో వాయిదా ఉంది; నడిచే వెళ్తాను" అన్నదట ఆ మూడుకాళ్ల ముసలిది. ★

# 29. నా పేరేమిటి?

**మా** అమ్మమ్మ ఒక కథ చెప్తూ వుండేది. అలాటి కథలు ఇప్పుడు ఎవరి అమ్మమ్మలైనా అసలు చెబుతున్నారో లేదో అని అనుమానం వేస్తున్నా, మా అమ్మమ్మ చెప్తూ వుండే కథలు ఆ రోజుల్లో మాకు అవి ఏవో అమ్మమ్మ కథల్లా అనిపించేవి కాదు.

అనగా అనగా ఒక ఈగ. ఆ ఈగ, ఇల్లు అలుకుతూ, తన పేరేమిటో మరచిపోయి గొప్ప బాధపడిపోయింది. అలుకుతూ, అలుకుతూ ఉన్న ఇంటిని అలా వదిలేసి పేదరాసి పెద్దమ్మ దగ్గరికెళ్లి, "పెద్దమ్మా, నా పేరేమిటి" అని అడిగింది. "నాకు తెలీదు, మా అబ్బాయిని అడుగు" అంది పెద్దమ్మ. అలా ఈగ గారు పేదరాసి పెద్దమ్మనీ, పెద్దమ్మ కొడుకునీ, కొడుకు చేతి గొడ్డలిని, గొడ్డలి కొట్టే మానుని, మాను మీద వాలే రామచిలుకని, రామచిలుకని పెంచే రాజకుమారుణ్ణి, రాజకుమారుడెక్కే గుర్రాన్ని, గుర్రం కడుపులో ఉన్న పిల్లని అడిగితే గాని